క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో గురువారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పర్యటించనున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్ తెలిపారు. జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా మల్లుపల్లి గ్రామంలో రూ.లక్ష 80 వేలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ప్రారంభించనున్నట్లు చెప్పారు.

పౌష్టికాహారం అవసరం



సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సీమంతం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త సౌమ్య మాట్లాడుతూ.. గర్భిణులకు పౌష్టికాహారం ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో నార్సింగి గ్రామ పంచాయతీ సభ్యురాలు వినోద పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ తనిఖీ



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శైలేశ్

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని ఆధార్ సెంటర్‌ను జెడ్పీ సీఈఓ శైలేశ్ బుధవారం తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు.

ఓటుహక్కుపై అవగాహన



నామినేషన్లు వేస్తున్న విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): ఓటు హక్కుపై ప్రతీ విద్యార్థికి అవగాహన ఉండాలని శివ్వంపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం బాలచంద్రం అన్నారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా విద్యార్థులు నామినేషన్లు వేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

బాలికల దినోత్సవం



చేగుంటలో మాట్లాడుతున్న హెచ్ఎం నీరజ

రామాయంపేట(మెదక్): పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి, ప్రిన్సిపాల్ అనురాధ, ఉపాధ్యాయులు సుజాత, సునీత, రేఖ, మంజుల, సమత తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు బాగా చదవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చేగుంట(తూప్రాన్): ఆడపిల్లలు బాగా చదువుకొని గొప్పగా ఎదగాలని చేగుంట కాంప్లెక్స్ హెచ్ఎం నీరజ అన్నారు. చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధ, సరస్వతి, శ్రీవాణి, రమా లలిత, శారద, శృతి, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవి పందిని ఢీకొని అదుపుతప్పిన కారు

ప్రమాదంలో మహిళ మృతి



నర్సాపూర్‌రూరల్: అడవి పందిని కారు ఢీకొని అదుపుతప్పింది. ఈ ఘటనలో కారులో ఉన్న మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈసంఘటన నర్సాపూర్ మండలం కొండాపూర్ అటవీ ప్రాంతం 765డీ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌కు చెందిన గుణాబాయి (50) కుమారుడితో కలిసి కారులో హైదరాబాద్ వెళ్తుంది. కొండాపూర్ అటవీ ప్రాంతంలో రోడ్డుపై అడవి పందిని ఢీకొంది. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రేలింగ్‌తో పాటు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో కారు ముందు సీట్లో కూర్చున్న గుణాబాయ్ అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రాథమిక విద్య అస్తవ్యస్తం

- అధికారుల పర్యవేక్షణ లేక మూతపడుతున్న పాఠశాలలు
- విద్యకు దూరమవుతున్న గిరిజనులు
- అల్లాదుర్గం మండలంలో ఐదు పాఠశాలలు మూత



తండా నుంచి ముప్పారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు

అల్లాదుర్గం(మెదక్): గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రాథమిక విద్య అస్తవ్యస్తంగా మారింది. ఒక్క విద్యార్థి ఉన్నా.. అక్కడే పాఠశాల నడిపించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. కొందరు టీచర్లు అనుకున్న చోట విధులు నిర్వర్తించేందుకు అధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకున్న పాఠశాలలను మూసి వేసి మరో పాఠశాలలో యథేచ్ఛగా పాఠాలు చెబుతున్నారు. విద్యార్థులు లేక, విద్యార్థులున్నా.. టీచర్ల నిర్లక్ష్యంతో మండలంలో ఐదు ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. బుధవారం ‘సాక్షి’ విచారణలో పలు ఆసక్తికర సంఘటనలు వెలుగులోకి వచ్చాయి.

- అల్లాదుర్గం కాన్షీరాం నగర్, చౌటాక్‌తండా, ముప్పారంతండా, సీతానగర్‌తండా, కుసంబీ నగర్ (పల్లెగడ్డ) గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. ముప్పారం తండా పాఠశాల టీచర్ 2022 డిసెంబర్‌లో మెటర్నిటీ సెలవులపై వెళ్లింది. సింగిల్ టీచర్ పాఠశాల కావడంతో మూతపడే పరిస్థితి. అయితే మండల అధికారులు ముప్పారం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడిని తండాకు డిప్యూటేషన్‌పై వేశారు. ఈ పాఠశాలలో ఏడు తరగతులు బోధించడం ఇబ్బందికరంగా మారింది. ముప్పారం పాఠశాల ఉపాధ్యాయులు ముప్పారం తండా తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, తండా విద్యార్థులను ముప్పారం పాఠశాలకు పంపిస్తే అక్కడ అందరికి పాఠాలు చెబుతామన్నారు. టీచర్ సెలవుల నుంచి వచ్చే వరకు ముప్పారం పాఠశాలలో తండా విద్యార్థులకు బోధించేందుకు నిర్ణయించారు.
- అయితే ఇదే అదనుగా భావించిన పాఠశాల టీచర్ శీరిష, ముప్పారం ప్రాథమికోన్నత పాఠశాల టీచర్లు తండా పాఠశాలను పూర్తిగా మూసేవేసి ముప్పారం పాఠశాలలోనే రెండు పాఠశాల విద్యార్థులకు బోధిస్తున్నారు. ముప్పారం తండా పాఠశాల టీచర్ 2023 జూన్‌లోనే సెలవులు ముగించుకొని వచ్చిన పాఠశాలను తెరవలేదు. తండా టీచర్ ముప్పారం పాఠశాలలో విధులు నిర్వర్తించాలని అధికారుల నుంచి ఏ ఆదేశాలు రాలేవు.
- ముప్పారం తండా నుంచి చిన్నారులు కిలోమీటర్ దూరం నడుచుకుంటూ ముప్పారం పాఠశాలకు ఇబ్బంది పడుతూ వెళ్తున్నారు.
- చౌటాక్ తండా ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది ఇద్దరు విద్యార్థులతో కొనసాగింది. ఈ పాఠశాలకు చెందిన టీచర్‌కు రోడ్డు ప్రమాదం జరగడంతో కొన్ని నెలలు సెలవులపై వెళ్లడంతో పాఠశాలను సీఆర్పీతో నడిపించారు. ఈసారి ఇద్దరు విద్యార్థులను మందాపూర్ పాఠశాలలో చేర్పించడంతో విద్యార్థులు లేక పాఠశాల మూతపడింది.
- అల్లాదుర్గం కాన్షీరాంనగర్, కుసంబీనగర్(పల్లెగడ్డ)ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేక మూతపడ్డాయి. ఈ పాఠశాల ఉపాధ్యాయులు మరో పాఠశాలలో పాఠాలు చెబుతున్నారు. తండాలోనే పాఠశాల నడిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ముప్పారం తండాలో ఆరు నెలలుగా తెరచుకోని పాఠశాల

చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారు



ముప్పారం పాఠశాల తండాకు కిలోమీటర్ దూరంలో ఉంది. చిన్న పిల్లలు అంత దూరం నడుచుకుంటూ వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. చిన్న పిల్లలు కావడంతో మధ్యలో ఏదైన జరిగితే ఎవరు బ్యాధత వహిస్తారు. ముప్పారం తండాలోనే పాఠశాల నడిపించాలి.

– చమ్మిబాయ్, విద్యార్థి తల్లి, ముప్పారం తండా

- సీతానగర్ తండా పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ఉండటంతో, అక్కడ ఉన్న టీచర్ రాజు విద్యార్థులను సీతానగర్ పాఠశాలకు రప్పించుకొని అక్కడ పాఠాలు చెబుతున్నారు. దీంతో సీతానగర్ తండా పాఠశాల మూతపడింది.



సీతానగర్ తండాలో మూతపడిన పాఠశాల

రక్తహీనత నివారణకు చర్యలు



చిన్నశంకరంపేట కస్తూర్బా పాఠశాలలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిన్నశంకరంపేట(మెదక్): ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమం ద్వారా బాలబాలికలలో రక్తహీనత నివారణ కోసం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చిన్నశంకరంపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధూ తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో బాలికలకు రక్తపరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు సంతోషి, జయంతి, సిద్ధిరాములు, ఎన్ఎం నాగరాణి, కస్తూర్బా పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో రక్తహీనత విముక్త భారత్‌లో భాగంగా విద్యార్థులకు రక్త పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు వేదశ్రీ, శ్రీనివాస్, సిబ్బంది యాదయ్య, హెచ్ఎం విఠల్ ఉన్నారు.

కాండం తొలుచు పురుగును నివారించాలి



చిలిప్‌చెడ్(నర్సాపూర్): అంతారంలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ బాల్‌రెడ్డి



నిజాంపేట(మెదక్): చల్మెడలో పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి గణేశ్

చిలిప్‌చెడ్(నర్సాపూర్): వరి పంటలో కాండం తొలుచు పురుగును నివారించుకోవాలని ఏఓ బాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అంతారంలో వరి పంటను పరిశీలించారు. కాగా పలువురు రైతుల వరి పొలంలో కాండం తొలుచు పురుగు పంటను ఆశిస్తుందని చెప్పారు. నివారణకు ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400గ్రాములు 200లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలని చెప్పారు.

వరి పంటలను పరిశీలన

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో బుధవారం వరి పంట పొలాలను వ్యవసాయ విస్తీర్ణ అధికారి గణేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పొలాలలో కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరాంత్రనిలిప్రోల్ ఎకరానికి 60 మిల్లీ లీటర్లు , జింక్ సల్ఫేట్ 400 గ్రాములను స్ప్రే చేయాలన్నారు. దేవేందర్‌రెడ్డి, శివరాజ్, సిద్ధిరాములు, నర్సింలు పాల్గొన్నారు.

పంటను కాపాడుకోవాలి

హవేళీఘణాపూర్(మెదక్): రైతులు వరి పంటకు సోకుతున్న వేరుకుల్లు, కాండం తొలుచు పురుగును గమనించి స్ప్రే చేసి పంటను కాపాడుకోవాలని ఏవో నాగమాధురి అన్నారు. మండల పరిధిలోని చౌట్లపల్లి, ముత్తాయిపల్లి గ్రామాల్లో వరి పంట పొలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో రాకేశ్, భార్గవ్, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

రామభక్తులను వెంటనే విడుదల చేయండి

నర్సాపూర్ రూరల్: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ఈనెల 22 నిర్వహించిన రాముడి ఊరేగింపులో జరిగిన సంఘటనలో కొంత మంది రామభక్తులను అరెస్టు చేశారు. దీంతో రామ భక్తులను వెంటనే విడుదల చేయాలని నర్సాపూర్ – సంగారెడ్డి రహదారిలో రుస్తుంపేట గ్రామస్తులు ధర్నా నిర్వహించారు.



ధర్నా చేస్తున్న రుస్తుంపేట గ్రామస్తులు

అంగన్‌వాడీ నిర్వహణపై సీపీడీఓ ఆగ్రహం

సొమ్మసిల్లి పడిపోయిన టీచర్

పాపన్నపేట(మెదక్): సీడీపీఓ ఆగ్రహం వ్యక్తం చేయడంతో తీవ్ర ఆందోళనకు లోనైన అంగన్‌వాడీ టీచర్ సొమ్మసిల్లి పడిపోయిన సంఘటన మండల కేంద్రం పాపన్నపేటలో బుధవారం జరిగింది. ఇందుకు సంబంధించి బాధిత టీచర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పాపన్నపేటలోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో మఠం శివరాణి 20 ఏళ్ల నుంచి అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తుంది. ఇటీవల టీచర్ సెలవు విషయంలో సూపర్‌వైజర్‌ను కాదని ఏసీడీపీఓ అనుమతి తీసుకుంది. దీంతో ఆగ్రహించిన సూపర్‌వైజర్ మంజుల, సీడీపీఓ, సిబ్బందితో కలసి కేంద్రం తనిఖీకి వచ్చారు. ఈ క్రమంలో కేంద్రం రికార్డులు, నిర్వాహణ సరిగా లేదని టీచర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నోటి కొచ్చినట్లు దూషించినట్లు బాధితురాలు వాపోయారు. దీంతో వణికిపోయిన తాను సొమ్మసిల్లి పడిపోయినట్లు చెప్పారు. ఈ విషయమై సీడీపీఓను వివరణ కోరగా.. అంగన్‌వాడీ టీచర్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు కేంద్రం తనిఖీకి వెళ్లినట్లు చెప్పారు. తాను ఎవరిని దూషించలేదని, భయపెట్టలేదని అన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో పడిపోయిన టీచర్ రాణి

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- అధికారులు బాధ్యతతో పనిచేయాలి
- మండల సర్వసభ్య సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. మన ఊరు – మనబడి, అభివృద్ధి పనుల బిల్లులు రావడం లేదని సభదృష్టికి సర్పంచ్‌లు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బిల్లుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని తహసీల్దార్ గ్రేస్‌బాయికి సూచించారు. మండల కేంద్రంలో వెంచర్ల వివరాలు ఇవ్వాలని, రాణి శంకరమ్మ భూముల లబ్ధిదారులకు న్యాయం చేస్తామని, నాణ్యమైన రేషన్ బియ్యం సరఫరా చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలను పూర్తి చేయాలని, డబుల్‌బెడ్రూం ఇళ్లలో విద్యుత్ సౌకర్యం వెంటనే కల్పించాలని, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేని భూములకు, నిబంధనలకు విరుద్ధంగా బిల్డింగ్‌లకు పర్మిషన్ ఇవ్వొద్దన్నారు. పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటానన్నారు. దీంతో పాటు మోడల్‌స్కూల్, డబుల్‌బెడ్రూం ఇళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం త్వరలో పదవీవిరమణ చేస్తున్న సర్పంచ్‌లను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ లక్ష్మి, ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా, సర్పంచ్ సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, మండల సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, ఆర్ఎన్. సంతోష్, నారాగౌడ్ ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ సుజాత



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. బుధవారం మండల కేంద్రం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రాధకిషన్ ఆధ్వర్యంలో పీడీ రమేశ్, ఉపాధ్యాయులు విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖోతో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషగిరిరావు, షేక్‌బబ్బు తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): యువతకు క్రీడాపోటీలు స్నేహభావాన్ని పెంచడంతో పాటు శారీరదృఢత్వం పెంపొందుతుందని సంకాపూర్ సర్పంచ్ సుజాత పేర్కొన్నారు. బుధవారం నార్సింగి మండలంలోని సంకాపూర్ గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ యూత్ టోర్నమెంట్ నిర్వహించారు. సంకాపూర్ గ్రామంలోని యువజన సంఘాల కోసం క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ జెండాల ఆవిష్కరణ

తూప్రాన్: మండలంలోని ఇమాంపూర్, పట్టణ పరిధిలోని బ్రహ్మణపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ జెండాను గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, భగవాన్ రెడ్డి, శశిభూషణ్‌రెడ్డి, నాగరాజు గౌడ్, సత్యనారాయణ, వేమారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని ప్రభుత్వ బాలుర ప్రాథమిక పాఠశాలను ఇన్‌చార్జి ఎంఈఓ బుచ్చానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. రాబోయే పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని, విద్యార్థుల హాజరుశాతం తగ్గకుండా చూడాలన్నారు. అనంతరం ఇటీవల గుండెపోటుతో మరణించిన బాలికల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జనార్దన్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వెంకటేశం, హెచ్ఎంలు రామచంద్రాచారి, బి. శ్రీనివాస్, రాజేశ్వర్, విజయ్‌కుమార్, మారుతి, ఉపాధ్యాయులు సిద్ధిరాములు, శంకర్, ప్రమోద్, సత్యకుమార్ తదితరులు ఉన్నారు.



పాఠశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఈఓ

ఘనంగా మల్లికార్జునస్వామి ఉత్సవాలు



అభిషేకానికి నీటిని తీసుకెళ్తున్న భక్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో అంగరంగ వైభవంగా కేతకి భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఉత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం ఆలయంలో షోడస ద్రవ్య అభిషేకం ఆలయ దాతలు వాల్దాస్ రాధా మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణగౌడ్ శ్రీకాంత్, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

టీఎస్జీఓ చేగుంట యూనిట్ అధ్యక్షుడిగా అశోక్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): టీఎస్జీఓ చేగుంట యూనిట్ అధ్యక్షుడిగా ఏఈఓ అశోక్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం చేగుంట ఎంపీడీఓ కార్యాలయంలో టీఎస్జీఓ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రానెమ్మ, భూమేశ్, రంగవ్వ, మాధవి, కోశాధికారిగా కలీం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ప్రవీణ్, ప్రచార కార్యదర్శిగా రామకృష్ణలను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు నరేందర్, జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, చేగుంట, మాసాయిపేట, చిన్నశంకరంపేట మండలాలసభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మీటర్లు లేనివారు డీడీలు చెల్లించాలి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వం అందించే ఉచిత విద్యుత్ ఇప్పటికే మీటర్లు ఉండి బాకాయిలేని వారికే వర్తిస్తుందని నార్సింగి ట్రాన్స్‌కో ఏఈ సీహెచ్. స్వామి తెలిపారు. ఇప్పటికి మీటర్లు లేకుండా విద్యుత్ వినియోగిస్తున్న వారు వెంటనే మీటర్ల కోసం డీడీలు చెల్లించి, వెంటనే మీటర్ నంబర్ పొందాలని కోరారు. మీటర్లు ఉండి బాకాయి పడ్డవారు వెంటనే తమ విద్యుత్ చార్జీలను చెల్లించి, క్లియర్‌గా ఉండాలని కోరారు.

◆ ఆలయ నిర్మాణం త్వరగా చేపట్టండి

చిలిప్‌చెడ్(నర్సాపూర్): హనుమాన్ ఆలయ నిర్మాణం త్వరగా చేపట్టాలని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి గ్రామస్తులకు సూచించారు. మండలంలోని గౌతాపూర్ ఆంజనేయస్వామి ఆలయం పునఃనిర్మాణానికి బుధవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ స్వరూప, నాయకులు మానిక్యరెడ్డి, వెంకయ్య, భూమయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

◆ నిధుల మంజూరుకు ప్రణాళిక సిద్ధం

కౌడిపల్లి(నర్సాపూర్): అన్ని వార్డుల్లో ఎలాంటి సమస్యలు లేకుండా అభివృద్ధికి నిధులు మంజూరుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం కౌడిపల్లిలో బుధవారం జీపీడీపీ (గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక)పై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యులు తిరుమలేశ్, కారోబార్ ఎల్లం, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ ప్రణాళికతో గ్రామాభివృద్ధి



శివ్వంపేట(నర్సాపూర్): ప్రజల సహకారంతో ప్రణాళికతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు అన్నారు. బుధవారం మండలంలోని కొంతన్‌పల్లి గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

◆ సన్మానం

చేగుంట(తూప్రాన్): మాజీ మంత్రి షబ్బీర్ అలీని ఐఎన్‌టీయూసీ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి హైదరాబాద్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

◆ సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో బుధవారం ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, సీడీపీ నిధుల నుంచి ప్రత్యేక నిధులు మంజూరు కావడంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ నరసింహారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేశ్, వార్డు సభ్యులు కిష్టయ్య, స్వామి పాల్గొన్నారు.

◆ మహిళ అదృశ్యం



సబిత(ఫైల్)

హవేళీఘణాపూర్(మెదక్): మహిళ అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని కొత్తపల్లికి చెందిన మిన్‌పూరి సబిత ఈ నెల 16న ఇంట్లో నుంచి వెళ్లి మళ్లీ రాలేదని భర్త మొగులయ్య హవేలీఘణాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్య కనిపించకపోవడంతో బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని, తన ఆచూకీ తెలిస్తే తెలపాలని పేర్కొన్నారు.